వందనాలు నీకివే.. వర గణేషా

- ఘనంగా వినాయక చతుర్థి వేడుకలు
- చవితి మండపాల నిర్వహణలో యువత ఉత్సాహం



గణనాథుడిని దర్శించుకుంటున్న వెంకటరావు, తదితరులు

విఘ్న సంహారకా.. అని శరణు వేడగానే గజానన రూపంతో కళ్ల ముందు కదిలే దైవం గణేశుడు. సకల విఘ్నాలను తొలగించి, చల్లగ కాచే తండ్రి వినాయకుడు. ఆ ఆది దేవుడికి వినాయక చవితి సందర్భంగా ఊరూవాడా, వీధి వీధినా చలువ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం పూజలు, భజనలు, తీర్థ ప్రసాద వితరణలతో ప్రతి మండపం.. ఓ ఆధ్యాత్మిక మందిరమే అయింది.





పెదగదిలిలో అయ్యప్ప స్వామి ఆలయ ఆకారంలో.. చినగదిలిలో 21 అడుగుల గణనాథుడు



కేఆర్‌ఎం కాలనీలో వినాయక మండపం వద్ద మహిళల కోలాటం

ఆరిలోవ: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సోమవారం విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇళ్లలో ప్రతిమలు పెట్టి, ప్రసాదం తయారు చేసి విఘ్నేశ్వరుడికి పూజలు చేశారు. ఆరిలోవ పరిసర కాలనీల్లో వివిధ ఆకారాలలో మండపాలు తయారు చేసి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాలు వద్ద విద్యుత్ దీపాలు, రంగుల తోరణాలతో అలంకరించారు. పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, ఆరిలోవ కాలనీ నుంచి తోటగరువు, డెయిరీఫారం వరకు, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాలలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆరిలోవలో ఎస్‌ఎంఆర్ కాలనీలో పవర్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుద్ధిని ఆకారం మండపం ఆకట్టుకుంటోంది. పెదగదిలిలో మేయర్ క్యాంప్ కార్యాలయం సమీపంలో రాధాకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి ఆలయ ఆకారంలో మండపం, చినగదిలిలో స్థానికులు ఏర్పాటు చేసిన 21 అడుగుల వినాయక విగ్రహం కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 100 వరకు గణేష్ మండపాలు ఏర్పాటు చేసినట్టు ఆరిలోవ పోలీసులు తెలిపారు.

అనుమతి తప్పనిసరి

సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. అనుపోత్సవాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు 11 రోజుల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు.



ఆరిలోవ ఎస్‌ఎంఆర్ కాలనీలో బుద్ధిని రూపంలో ఏర్పాటు చేసిన వినాయక పందిరి..



వాల్తేర్ బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ సర్కిల్ వద్ద వైజాగ్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లో ఇండియన్ యంగ్‌స్టర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్–2 రాకెట్ నమూనా మండపం ఆకట్టుకుంటోంది. 19వ వార్డు జాలరిపేటలో వివిధ రూపాల్లో గణనాథుడి ప్రతిమలు కొలువుదీరాయి. ఆదిపురుష్ చిత్రంలోని శ్రీరాముడి వేషధారణలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమ, టూటూలు వేస్తున్నట్లు ఏర్పాటు చేసిన విగ్రహాలు అబ్బురపరిచాయి.



ఏయూలో సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో..

ఏయూ క్యాంపస్: వినాయక చవితి సందర్భంగా చిన్నాపెద్ద కలసి వాడవాడలా గణనాథుని ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో వరుసగా 9వ సంవత్సరం ఏర్పాటు చేసిన గణనాథుడిని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సీఎస్వో మహమ్మద్ ఖాన్, పెద్ద సంఖ్యలో వర్సిటీ ఉద్యోగులు దర్శించుకున్నారు. 20వ వార్డు వాల్తేర్ బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం ఆకట్టుకుంటోంది. స్వామిని వైఎస్సార్‌సీపీ నాయకుడు మువ్వల సురేష్, తదితరులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పోలిరెడ్డి, ఉపాధ్యక్షుడు కె.శ్రీను, కార్యదర్శి ఆర్.వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డు ఆదర్శనగర్‌లో చంద్రయాన్‌-3 రాకెట్ నమూనా మండపం

మద్దిలపాలెం : వినాయక మండపాల వద్ద మహిళలు కోలాటంతో సందడి చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అందరూ మండపాల వద్ద పూజలు చేస్తున్నారు. పిఠాపురం కాలనీలో పీతలవానిపాలెంలో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వినాయక మండపం అందరిని విశేషంగా ఆకట్టుకుంటుంది. కేఆర్‌ఎం కాలనీతో పాటు పలు ప్రాంతాలలో పీవీఆర్ ప్రాజెక్టు చైర్మన్ గుప్తా బుల్లి బృందం ఉదయం సాయంత్రం వేళలలో ప్రసాదం పంపిణీ చేశారు.



పిఠాపురం కాలనీలో వెదురుతో తయారు చేసిన వినాయక మండపం



జాలరిపేటలో ఏర్పాటు చేసిన టాటూ గణపతి



ఆదిపురుష్ గెటప్‌లో గణనాథుడు

క్లుప్తంగా

నాస్తిక సమాజం వెబ్‌సైట్ ఆవిష్కరణ



నాస్తిక సమాజం వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న జయగోపాల్

ఆరిలోవ: ద్రవిడ ఉద్యమ నిర్మాత పెరియార్ ఈవీ రామస్వామి 145వ జయంతి మంగళవారం ఆరిలోవలో నాస్తిక సమాజం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాస్తిక సమాజం వెబ్‌సైట్‌ను వ్యవస్థాపక అధ్యక్షుడు జయగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామస్వామి ఆగ్నేయ ఆసియా సోక్రటీస్‌గా పేరుగాంచారన్నారు. భారత నాస్తిక సమాజం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురళి, అజయ్, శ్యామల, నూకరాజు, వరప్రసాద్, శ్రీనివాసరావు, సునీత పాల్గొన్నారు.

నేడు ఏఎన్‌ఆర్ శత జయంతి వేడుకలు

మద్దిలపాలెం : నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు కళాభారతి ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలో కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఎచటకోయి నీ ప్రయాణం అనే శీర్షికతో అక్కినేని నాగేశ్వరరావుకు స్వర నీరాజనం అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

ఆటో డ్రైవర్‌కు సాయం



ఆటో డ్రైవర్‌కు సహాయం అందిస్తున్న సీపీఐ 16వ వార్డు కార్యదర్శి పడాల గోవింద్

మద్దిలపాలెం : కొద్ది రోజులుగా ఇంటికే పరిమితమైన ఆటోడ్రైవర్ కడిమి అప్పలరాజుకు సీపీఐ 16వ వార్డు కార్యదర్శి పడాల గోవింద్ సహాయం అందజేశారు. రజకవీధిలోని అప్పలరాజు ఇంటికి వెళ్లి మంగళవారం పడాల గోవింద్ ఆర్థిక సహాయంతో పాటు, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మధురెడ్డి, ఎల్.గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహం

బీచ్ రోడ్డు: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం ఆదివారం రాత్రి తీరానికి కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎస్‌ఎస్‌ఎన్ నగర్‌లో స్థలం ఆక్రమణ

- అడ్డుకున్న స్థానిక మహిళలు
- జీవీఎంసీ అధికారుల దృష్టికి వివాదం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ సమీప ఎస్‌ఎస్‌ఎన్ నగర్‌ను ఆనుకుని ఉన్న జీవీఎంసీ స్థలంలో పలువురు షెడ్ల నిర్మాణానికి సన్నాహాలు చేయడంపై వివాదాస్పదమైంది. ఇక్కడ మామిడి తోటలో మంగళవారం బయట ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు రెడీమేడ్ షెడ్లు వేయడానికి ఇనుప ఫ్రేమ్‌తో తయారు చేసిన రేకులను వ్యానులో తీసుకొచ్చారు. గతంలో ఈ స్థలంలో కొందరు వేసిన రేకుల షెడ్లను జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఇది జీవీఎంసీకి చెందిన స్థలమని, ముడసర్లోవ వాటర్ కేచ్‌మెంట్ ఏరియాలో ఉందని హెచ్చరించారు. అప్పటి నుంచి సుమారు రెండేళ్లుగా ఈ స్థలం వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. తాజాగా 10 మందికి పైగా వచ్చి ఇక్కడ షెడ్‌లు వేసే ప్రయత్నం చేశారు. గమనించిన స్థానిక మహిళలు, గతంలో ఈ స్థలంలో పాకలు వేసినవారు వారిని అడ్డుకున్నారు. వాగ్వాదం చేశారు. అయినా ఈ స్థలం తమదేనంటూ షెడ్లు వేశారు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. జీవీఎంసీకి చెందిన స్థలమైతే ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళకు ఆశ్రయం



లక్ష్మిని నిరాశ్రయ వసతి గృహానికి తరలిస్తున్న ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళకు చికిత్స అందించి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన సిరిపురం హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుక ఒక మహిళ ఉందని, ఆమెకు మతిస్థిమితం లేదని గుర్తించిన స్థానికులు సమాచారం అందజేశారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది ఆమెను చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. అక్కడ చికిత్స తర్వాత ఆమె ఆరోగ్యం కుదుటపడింది. వైద్యుల సూచన మేరకు ఏయూటీడీ సిబ్బంది మంగళవారం ఆమెకు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మహిళల నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

'మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ'



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన విశాఖ జిల్లా సమితి సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పాటుతో బీజేపీ నాయకత్వంలో వణుకు ప్రారంభం అయిందన్నారు. ఇండియా పేరును భారత్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రేరేపితంతోనే రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

సీతమ్మధార : మహిళా బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జన జాగరణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం యావత్ భారతీయ మహిళలు ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రధాని నాయకత్వంలో బిల్లు ఆమోదించినందుకు మహిళలందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారని అన్నారు. మహిళా బిల్లు ఆమోదంతో భారత్ మాతాకీ జై అనే నినాదం సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు, హరికృష్ణ, ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నేడు గడువు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి బుధవారంతో గడువు ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఓఏఎండీసీ నుంచి అలాంట్ అయిన కాపీతో పాటు సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలతో గడువు ముగుస్తుందని సూచించారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్ఠంపజేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆజలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

తోపుడుబండ్ల తొలగింపు అన్యాయం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల కార్మికులు

సీతమ్మధార: పి.ఎం.పాలెం నుంచి జూపార్కు వరకు ఉన్న తోపుడు బండ్లను జూ అధికారులు తొలగించడం అన్యాయమని సీఐటీయూ కార్యదర్శి ఎ.సింహాచలం, పి.వెంకటరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా తోపుడు బండ్లు, చిన్నచిన్న బడ్డీలు పెట్టుకుని ఎంతో మంది బతుకుతున్నారని అన్నారు. ఇప్పుడు జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, అటవీశాఖ అధికారులు దాడులు చేసి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేశాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండ్ల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జాతీయ స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం రోడ్డు పక్కన బతికే చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలని కోరారు. జూపార్కు రోడ్డులో ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎ. కిరణ్‌కుమార్, ఎస్.లక్ష్మణ్, ఎస్.ధనంజయరావు, పి.రమణ, తోపుడు బండ్ల కార్మికులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం..

తాపీ ధర్మారావు జయంతి వేడుకలు నేడు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు, సంగీత నృత్య విభాగం, సమైక్య భారతి–విశాఖ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయ బీఆర్ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో బుధవారం నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ముందుకు నడుస్తూ మరో వైపు సాహిత్యాన్ని నడిపించిన నవీన వైతాళికుడు ధర్మారావని కొనియాడారు. హేతువాదిగా, నాస్తికుడిగా పేరొందిన తాపీ ధర్మారావు జన్మదినాన్ని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్–కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్ఈ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, కామర్స్– మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖాధ్యక్షుడు ఆచార్య జాలాది రవి, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎస్.అనురాధ, తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, విశాఖ రచయితల సంఘం ప్రతినిధి, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ మరడాన సుబ్బారావు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, సత్యానందం, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మద్దిలపాలెం జట్టు



క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : వినాయక చవతి సందర్భంగా గత వారం రోజులుగా జీవీఎంసీ 16వ వార్డులో అబ్దుల్‌కలాం పార్కులో ఎస్ఎస్ఎన్ఆర్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మద్దిలపాలెం డ్రీమ్ ఎలివెన్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ట్రోఫీతో పాటు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. రన్నరప్ జట్టుకు ట్రోఫీతో పాటు, రూ.5వేలు అందజేయగా, తృతీయ బహుమతిగా రూ.2500 అందించారు.